# యస్... మిస్!

సముద్రం దుప్పటి కప్పుకుని, బద్ధకంగా ఆకాశం అంచులు చూస్తున్నట్లున్న సూర్యుణ్ణి తట్టి లేపడానికా అన్నట్లు విశాఖపట్నం సిటీ బస్సుల రొద తెల్లారకుండానే మొదలైంది. కోడి కూతలకుగాక, ఫ్యాక్టరీ సైరన్లకు నిద్రలేచే అలవాటున్న ఆ ఊరి జనం హడావిడిగా లేస్తుండగా, కలతనిద్దర్లో ఏదో కల గంటూన్న కల్పనకు కూడా తెలివచ్చేసింది. కానీ, వెంటనే కళ్ళు తెరవాలి అనిపించలేదు. అడ్డమైన రకాల చప్పుళ్ళూ.. "లే...లే" అని హెచ్చరిస్తూంటే - తన వయసు మరో రోజు ముందుకుపోయిందే అన్న బెంగతో కళ్ళు మూసుకుంది.

వంటింట్లోంచి వాళ్ళమ్మ కేకలు పెడుతోంది. "ఒరేయ్! శివుడూ! శివుడూ! మీ అక్కను లేచొచ్చి ఇంట్లో పడుక్కోమను. ఈడొచ్చిన ఆడపిల్లలు వాకిట్లో పడుకొనే కాలమా ఇది? పై వాటాలోనూ, పక్క డాబాల్లోనూ అందరూ మగ గుంటలే. లేచిందగ్గరనుంచీ అలా ఆ పిట్టగోడల దగ్గరే తచ్చాడుతుంటారు.'

కల్పనను నేరుగా ఆవిడెప్పుడూ లేపదు. ఆత్మీయంగా చేత్తో తట్టి 'లేరా! కల్పనతల్లీ! పొద్దెక్కి పోతోందీ అంటూ తల్లి ఒక్క రోజైనా లేపకూడదా' అనుకుంటూ బాధపడుతుంది కల్పన, కానీ, అమ్మ దృష్టిలో కల్పన అంటే ఇరవైమూడేళ్ళు వొంటి మీదికొచ్చిన గుండెలమీద కుంపటి, ఆవిడకెంతసేపూ ఎవడో ఒక తలమాసినవాడికిచ్చి ఈ పిల్లని కట్టబెట్టి అత్తారింటికి తోలెయ్యడమే కావాలి.

అరచేతిలో 'శ్రీరామ' అని రాసి, కళ్ళు తెరిచి చూసుకుందామనుకున్న కల్పన అలా కళ్ళు మూసుకునే పైట ఒకసారి సర్దుకుంది. అరచెయ్యి మొహం ముందు పెట్టుకొని కళ్ళు తెరిచిందేకానీ, ఆ పిల్ల చూపులు అరచేతి అంచులను దాటి పైకి పాకేయి. విశాఖపట్నం ఆకాశం - నిరంతరం ఫ్యాక్టరీ గొట్టాలలో నుంచి బుసబుస వచ్చే నల్లని పొగలతో మాసిపోయి అలుగ్గుడ్డలా ఉంది. అది కూడా వాళ్ళ ఇరుకు వాటా వాకిట్లోంచి ఎంత కనబడుతుందేం! 'నాలాగే ఉంది 'వెధవాకాశం' అనుకొని టక్కున లేచి, అప్రయత్నంగా ఒక చేత్తో దిండూ, మరో చేత్తో మంచం పట్టుకొని ఇంట్లోకి వచ్చేసింది.

"తల్లీ! నీ స్కూలుకు వేళవుతుందేమో. ముందు నువ్వు స్నానం చేసేస్తావేమిటి? ఆనక మళ్ళీ నీళ్ళు రావేమో!" అరిగిపోయిన బ్లేడుతో, ముదిరిపోయిన గడ్డాన్ని పట్టుకొని తంటాలుపడుతూ అన్నాడు

నాన్న. నాన్నకి బెంగ, తను ఉద్యోగంలోకి వెళ్ళడం మానేస్తుందేమోనని. కానీ, ఈ మగాళ్ళ ప్రపంచం మధ్య పడి, రెండు సిటీ బస్సులు మారి, 'దేవుడా' అంటూ టీచరు ఉద్యోగంచెయ్యడం కోసం వెళ్లడం ఎంత విసుగో నాన్నకు తెలీదు. అమ్మకూ తెలీదు. ఎల్‌కె.జీలో ఎబిసీడీలు - ఏ ఫర్ ఏప్ల్, బిఫర్ బ్యాట్ చెప్పటానికెూడా బియ్యీడీ కావాలంటుంది ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్.

ఆలోచనల్లో పడిపోయి తదేకంగా అద్దంలో చూసుకుంటున్న కల్పనకు పెదాల మధ్య సన్నని చిరునవ్వు మెరిసింది. "హెడ్‌మిస్ట్రెస్" అని అంటే వాళ్ళ స్కూలు శ్యామసుందరికి కోపం. "హెచ్‌ఎమ్ అనండి చాలు" అంటుంది.

కోపం వచ్చినప్పుడు స్థూలకాయంతో రొప్పుతూ మాట్లాడే హెచ్‌ఎమ్‌ని తలుచుకుంటే నవ్వొచ్చింది కల్పనకు. అద్దంలో చూసుకుంటూ ఉంటే మధుర భావన లొస్తూంటామ్. కల్పనకు. కానీ, కమ్మని సంగీతంలో అపశ్రుతిలాగ నల్లని నొక్కునొక్కుల కురుల మధ్య ఒక వెండి వెంట్రుక కనపడ్డది. గుండెల్లో రాయి పడ్డట్టయింది. ఆ శ్వేతకేశాన్ని పెరికి పారేసే ప్రయత్నంలో ఉండగా, మళ్ళీ అమ్మ కేక - "ఎవళ్ళో ఒకళ్ళు వెళ్ళండి బాత్రూంలోకి.. కొళాయిలు కట్టేస్తారింక" అని.

పిడికెడు మెతుకులు ఎలాగో మింగి, గాజువాకలో ఉన్న స్కూలుకు గోపాలపట్నం నుంచి మహాప్రస్థానం ముగించి, "శ్రీ వెంకటేశ్వరా గ్రీన్‌లాండ్స్ ఇంగ్లీష్ మీడియం స్పెషల్ కాన్వెంట్ హైస్కూల్' చేరేసరికి ప్రాణం కడబెట్టిందా పిల్లకు.

అప్పటికే ప్రార్థనకోసం పిల్లలంతా ఒక చిన్న వాకిట్లో సర్దుకు సర్దుకు నిలబడుతున్నారు.

ఆ రోజు ఏ కళనుందోగాని హెడ్‌మిస్ట్రెస్...సారీ హెచ్‌ఎమ్‌గారు - శ్యామసుందరి "భాఀ...భాఀ" మనలేదు. "టీచర్లు స్టూడెంట్స్ కన్నా ముందుగా రావాలి" అని ఓ లెక్చరివ్వలేదు.మంచి రోజే.

ప్రేయర్ అయినాక క్లాసులోకి వచ్చిన నలభైమంది పిల్లలకి అటెండెన్స్ తీసుకునేసరికి కల్పన మొహం మీద చిరుచెమటలు పోశాయి. చిన్నపిసరు విసుగనిపించింది. క్లాసు వేపు చూసింది. పాఠం మొదలెట్టాలంటే చిరాగ్గా ఉంది. పొద్దున్న ఇంట్లో అమ్మతో పడ్డ ఘర్షణే మదిలో ములుకై మెదలుతోంది.

క్లాసులో మూలగా కూర్చున్న జాంబా, జానకీ - చెవులు కొరుక్కుంటున్నారు. కల్పనకు కోపం వెళ్ళగక్కటానికి మంచి అవకాశం దొరికింది...

"ఏయ్! యూ ఫూల్స్! సైలెన్స్ అండ్ స్టాండప్" అంది. వాళ్ళిద్దరూ లేచి నిలబడి "మేడమ్... మరేమోనే"... అంటూ ఏదో సంజాయిషీ ఇచ్చేలోగా, కల్పన కళ్ళెర్రజేసి స్కేలు పట్టుకొని, హైఀయ్‌మని లేచేసరికి గప్‌చిప్ అయిపోయారు.

కల్పన తమాయించుకుని పాఠం చెప్పడంకన్నా హోమ్‌వర్కులుచూడటం 'బెటర్' అనుకుంది.

మాడమ్ మనసెరిగిన క్లాస్ లీడర్ శాంభవి తోటి పిల్లలందర్నీ దబాయించి మరీ హోమ్‌వర్క్ బుక్స్ తీసుకుని టీచర్ బల్లమీద తెచ్చిపెట్టింది.

కల్పన అప్రయత్నంగా నిట్టూర్చింది. ఈ క్లాస్ నయం. పొద్దున ఇంటిదగ్గర పన్నెండేళ్ళ తమ్ముణ్ణి పిలిచి, "వీధి చివర దుకాణంలో సేఫ్టీ పిన్నులు తీసుకురారా" అంది తను.

"నేను తేను ఫో." వెంటనే అన్నాడు వాడు.

"వెధవా! ఈమాత్రం చిన్న పని చెయ్యలేవురా?" అంటూ స్కూలు అలవాటుగా స్కేలు పట్టుకొని ఒక చిన్నదెబ్బ వెయ్యబోతే, "ఇదేం నీ క్లాసురూం కాదే తల్లీ" అంటూ అమ్మ వాణ్ణి వెనకేసుకొచ్చింది. ఇరవై మూడేళ్ళ ఆడపిల్లకన్నా పన్నెండేళ్ళ మగగుంటడెక్కువై పోయాడన్నమాట.

"ఎందుకే అమ్మా నీకంత కోపం నామీద? రోజూ ఆరుగంటలు ఆ స్కూల్లో ఒళ్ళు హూనం అయ్యేలాగా చచ్చి చచ్చి వస్తున్నాను చాలదా?" అంది తను.

"ఎవరు చేసుకోమన్నారే, చదువుల సరస్వతీ... నిన్నొళ్ళు హూనం?" అమ్మ వెటకారం, కోపం మిళాయించి మాట సాగదీసింది. "ఏదో గంతకు తగ్గ బొంత అని నాన్నగారు తెచ్చిన సంబంధం చేసుకోవే అంటే విన్నావా?"

కానీ, తనూ మనిషేగా... బియ్యే పాసయింది. ఉద్యోగం కూడా చేస్తోంది. కన్ను వంకరా, కాలు వంకరా లేవు. మరి... రెండో పెళ్ళాణ్ణో లేకపోతే ఓ అండర్ గ్రాడ్యుయేట్‌నో చేసుకోమంటే ఎలా చేసుకోగల్దు?

"ఇంకా నాలుగేళ్ళు - మీ తండ్రీ కూతుళ్ళు కూడబలుక్కుని ఉద్యోగమే కొనసాగిస్తే. ఆ రెండో పెళ్ళాడు కూడా రాడే నీకు... కర్మ"... అంటూ వచ్చి అమ్మ "ఇంద నీ సేఫ్టీ పిన్ను" అంటూ తన జాకెట్టుకున్న పిన్ను తీసి అక్కడ ఇలా పడేసింది.

ఆ పిన్ను పెట్టి పొడిచినట్లయింది కల్పనకి 'ఛీ... ఇంత చదువు చదివాను. ఇదే మగపిల్లవాడైతే అమ్మా నాన్నా కూడా మురిసి చద్దురు' అనుకుంది కల్పన.

"మాడమ్! బుక్సులు చూడరూ?" అన్న శాంభవి పిలుపుతో ఉలిక్కిపడి కల్పన నోట్‌బుక్‌లలో ఒకదానిని అందుకుంది.

"బుక్సులు కాదు. బుక్స్ అనాలి" అని ఆ పిల్ల మాటను దిద్దింది.

హోమ్‌వర్క్ చూసి, రిమార్కులు కూడా రాయడం మొదలుపెట్టింది. క్లాసులో పిల్లలందర్నీ కాపీ పుస్తకాలు తీసి రాయమని పురమాయించి, అజమాయిషీని శాంభవికి అప్పగించింది.

"పేరెంట్స్‌కి మంచి ఇంప్రెషన్ కలగాలంటే, నోట్‌బుక్స్‌లో రిమార్కులు రాస్తూండాలి" అని హెచ్.ఎమ్. చెబుతూ ఉంటుంది. ఒక పిల్లవాడి బుక్‌లో అక్షరాలు సరిగాలేవు. "ఇంటి దగ్గర శ్రద్ధ వహించవలెను" అని రాసింది.

మరోదానిలో "పుస్తకములు నీటుగా ఉంచవలెను" అని, ఇంకోదానిలో "ఇంప్రూవ్ యువర్ హ్యాండ్‌రైటింగ్" అనీ - ఇలా రిమార్కులు రాసింది.

ఆ తర్వాత హోమ్‌వర్క్ చెయ్యకుండా వచ్చిన వాళ్ళని విచారించింది.

"మా అమ్మగారు రాత్రి మా ఇంటికి చుట్టాలొచ్చారని చెప్పమంది మిస్" అంటూ సంజాయిషీ ఇచ్చిందో చిన్నారి.

"మీ ఇంటికి చుట్టాలొస్తే నువ్వు హోమ్‌వర్కు చెయ్యడం మానేయడం ఎందుకు?" కల్పనకు అర్థంకాలేదు.

"మా మమ్మీయే కదా మిస్ నాకు లెక్కలు చెప్పాలి." అసలు రహస్యం చెప్పేసిందా చిన్నారి.

"హుఁ! అదంతా నాకు తెలీదు. నువ్వు 'నీల్‌డౌన్' చెయ్యి" అంటూ స్కేలు ఝుళిపిస్తూ ఆ పాపని మోకాళ్ళ మీద నిలబెట్టింది కల్పన.

మరో అమ్మాయి నోట్‌బుక్ మీద తను నిన్న రాసిన రిమార్కు కింద ఆ అమ్మాయి తల్లి - "హోంవర్కు చాలా ఎక్కువగా ఇచ్చుచున్నారు. మాకు వేరే పనులు కూడా ఉండును కనుక, బడిలో కూడా వర్క్ చేయించవలెను" అని రాసిన రిమార్కు చూసి కల్పనకు ఒళ్ళు మండిపోయింది.

"ఏయ్ సరళా! ఇలా ఇకమీదట ఎప్పుడూ రిమార్కులు రాయించుకు రాకు. పది గుంజీలు తియ్. మరోసారి ఇలాంటి రాతలు నీ బుక్‌లో చూశానంటే, 'డిబార్' చేయించేస్తాను, టేక్కేర్!" అంది డిబార్ అంటే అర్థం తెలీక కాబోలు ఆ పిల్ల బ్యార్‌మంది.

దాంతో క్లాసులో తతిమ్మా పిల్లలంతా కూడా గోల మొదలెట్టారు.

'అబ్బబ్బ! ఏమిటీ సంతగోల బాబూ... తెలుగు మీడియం స్కూలులాగ' అనుకుంది.

'ఎనిమిది వందల మీద సంతకం పెట్టి... నాలుగు వందలు తీసుకొనే ఈ ఉద్యోగం చెయ్యడంకన్నా అమ్మ చూపెట్టిన సినిమా గేటుకీపర్ అప్పల్రాజుని పెళ్ళి చేసుకోడమే నయం' అని గొణుక్కుంది కల్పన. స్కూలు యాజమాన్యం మీద, హెచ్.ఎమ్. మీద సొసైటీ మీద, ఎదురుగా ఉన్న పిల్లల మీద కల్పనకు తిరుగులేని కోపం వచ్చింది!

"హోల్ క్లాస్ స్టాండప్" అంది.

అంతలో, "కల్పనమ్మగోరూ! హెచ్చెమ్మగోరు రమ్మంతన్నారు" అంటూ ఆయా గంగానమ్మ వచ్చింది. "ఏం కొంప మునిగిందిటా?" అంటూ కల్పన క్లాసుని మానిటర్ శాంభవికి అప్పగించి "పద' ' అంటూ నడిచింది.

హెచ్‌ఎమ్ శ్యామసుందరి కల్పనను తన సోడాగ్లాసు కళ్ళద్దాల్లోనుంచి తీక్షణంగా చూసి, "మీ క్లాసులో ఇంకా చాలామంది ఫీజులు కట్టలేదు. హోమ్‌వర్క్ నోట్‌బుక్స్ మీద నోట్‌లు రాసి పంపు. కమిటి సెక్రటరీగారు గోలెడుతున్నారు" అంది.

అంతలో మాసిన గడ్డం, తలకి మాసిన తలగుడ్డా, పంచె, బనియన్ మనిషి ఒకడొచ్చాడు. "దండాలమ్మా" అన్నాడు. హెచ్‌ఎమ్‌కి వంగి వంగి దండం పెడుతూ. "నువ్వా సిమ్హాచెలం!

మీ పోలయ్యకి ఫీజు కడదామని వచ్చావా? వెళ్ళి గుమాస్తామ్మగారికిచ్చెయ్... రసీదిస్తారు" - అంది దర్పంగా శ్యామసుందరి.

సిమ్మాచెలం బనీను జేబులోంచి బాగా నలిగిపోయిన మాసిపోయి ఉన్న రూపాయి కాగితాలను తీసి మడతలు సాపుచేసి పట్టుకుంటూ, "అది కాదండమ్మగోరూ ఫీజు కట్టడానికింకా టైముందేటని అడగతానికి ఇలాగొచ్చిసినానండి" అన్నాడు.

మరి ఈ డబ్బు దేనికన్నట్లు చూస్తూ "ఫైనుతో కడతానంటే ఇరవయ్యో తారీఖుదాకా టైముందిలే. ఇవాళ పదిహేనేగా.. ఫో... అంది శ్యామసుందరి కేలండర్‌వైపు చూస్తూ.

కల్పనకు ఈ సిమ్మాచెలం అన్న మాసిన మనిషి దారి తప్పి ఓ చోటుకి రాబోయి, మరో చోటుకి వచ్చేసినవాడిలాగ కనబడ్డాడు. పెద్ద ఆఫీసర్లెవరైనా వాళ్ళ నౌకర్ని పంపించారేమోననుకుంది. సిమ్మాచెలం కొంచెం తాపీపడ్డాడు. "అయితే, బెంగనేదమ్మగారూ నాల్రోజులు, డే అండ్‌నైట్ ఏసేశానంటే సరిపోతాది. అద్సరేగానండమ్మా.. మా పోలిగాడు ఎలా సతుకుతున్నాడేటి?" కుతూహలంగా అడిగాడు. "వాళ్ళమ్మ మా ఇదైపోతాంది... దానికి చెప్తావ(ని" సంజాయిషీగా అన్నాడు.

వాడి కళ్ళలో భయాన్ని చూసింది కల్పన.

శ్యామసుందరి కల్పనవైపు వేలెట్టి చూపెడుతూ "ఈ మిస్‌గారి క్లాసులోనే ఉన్నాడు మీ పోలయ్య..." అని, కల్పననుద్దేశించి, "ఈ రిక్షా సిమ్మాచెలానికున్న శ్రద్ధ గొప్ప గొప్ప ఆఫీసర్లకు కూడా లేదనుకో... మీ స్టూడెంట్ పోలయ్య లేడూ? - వాళ్ళ ఫాదరితనే! ఎలా చదువుతున్నాడు వాడు? చెవికి పోగూ వాడూనూ. బాగా చురుగ్గా ఉంటాడు... జ్ఞాపకం వచ్చాడా?" అంది.

కొడుకుని టీచరమ్మ మెచ్చుకొనేసరికి సిమ్మాచెలం కళ్ళలో మెరుపుతీగెలు కదిలాయి.

కల్పన భ్రుకుటి ముడిచింది. "నోట్‌బుక్స్ అన్నీ లేవు మాడమ్.. వాడికి" అన్నది ఫిర్యాదు చేస్తున్నట్లు.

వెంటనే సిమ్మాచెలం నాలిక్కర్చుకుని "అంపిత్తానండమ్మా - నా తప్పే తల్లీ.. పోయినోరం వాళ్ళమ్మ కొకటే దగ్గుతెర వొచ్చేసినాది.. మందులకైపోయినాయి డబ్బులన్నీ" అని సంజాయిషీ ఇచ్చుకొని, "ఇయిగోనమ్మా ఆడి ఇస్కూలు రిచ్చా డబ్బులు.. ఎధవని, అన్నీ నలిగిపోయిన కాయితాలేఇత్తున్నాను. ఏటనుకోకండేం. మీనాంటి పాసింజర్లిచ్చినయ్యేనమ్మ గోరూ" అంటూ తన చేతనున్న ఐదు రూపాయల కాగిథాలు ఆరూ శ్యామసుందరికి అందించాడు.

"నీకు రిక్షా ఉందిగా - వాణ్ణి అందులోనే దించరాదూ? ఈ డబ్బులు కూడా ఎందుకూ దండగ?" ' శ్యామసుందరి జాలిగా చూసింది సిమ్మాచెలం వేపు.

"అబ్బే! అడొప్పుకోడమ్మా, స్కూలు రిచ్చా అంటే అడికి సర్దా... నా బండి అయితే ఆడికి ఫ్రెండ్సులో నామర్ధా అంట. మరి వెళ్ళొస్తానమ్మా చిన్న టీచరమ్మా! సెంటర్లోకెళ్లానంటే మంచి బేరం

తగుల్తాది. ఏదో అంతా మీ దయ ఆడు బాగా నతికి గొప్పోడవాల, మీ పేరు సెప్పుకోవాల" అంటూ ఇద్దరికీ దండాలు పెట్టి సిమ్మాచెలం వెళ్ళిపోయాడు.

"రెక్కల కష్టంపెట్టి, ప్రయివేటు స్కూల్లో సిమ్మాచెలం లాంటి కష్టజీవి పోలయ్యని ఎందుకు చదివిస్తున్నట్లు? పెద్దయినాక వాడికి పెద్ద ఉద్యోగం రావాలనేగా.' క్లాసుకి తిరిగి వస్తున్న మిస్ కల్పనకు లోపల గుండెల్లో సముద్రంలాగ కల్లోలం చెలరేగింది. పెళ్ళయ్యేదాకా కాలక్షేపంగా లోకం మొహం కప్పటానికి చేసే వెధవ్వుద్యోగం కాదన్నమాట! తనది. కల్పన క్లాస్‌లో అడుగు పెట్టేసరికి కూడా యింకా క్లాసంతా "స్టాండప్" లోనే ఉంది. చివుక్కుమంది కల్పన గుండెల్లోపల.

"సిడౌన్ మై డియర్ కిడ్స్" అంది. తియ్యని ఆవేదనామె కంఠంలో ప్రతిఫలించింది.

"పోలయ్యా" అని కేకేసింది. నీలం లాగూ, తెల్ల చొక్కా, చెవికి కాడా - తమాషాగా ఉన్నాడు. కలువ కాడ నడిచివచ్చినట్టు వచ్చాడు పోలయ్య. నిక్కర్ పైకి లాక్కుంటూనే, చేతులు కట్టుకునే విఫల ప్రయత్నం చేస్తున్న వాడి తల నిమిరింది కల్పన. మొట్టికాయలు వేస్తుందేమో మిస్ అని వాడు వెనక్కి జంకేడు. కానీ, ఆత్మీయంగా వాడి తల నిమిరింది మిస్ కల్పనా బియ్యే.

"బాగా చదువుకో పోలయ్యా!" అంటూ వాడి భుజం తట్టింది. వాడి మొహం ఆశ్చర్యంతో, ఆనందంతో చేటంతయింది!

"మిస్" అంటూ వాడు విచ్చురూపాయి ఒకటి జేబులోంచి తీసి కల్పనకి అందించాడు.

"ఇందెందుకురా?" అంది కల్పన ఆశ్చర్యంగా.

"యస్... మిస... ఆల్ నోట్స్ నో... ఫర్ మీ ... మీన్స్ యు సెడ్ ఫైన్... మైడాడీ సెడ్... గివ్ ఫైన్ ఫస్ట్...' అంటూ వాడు ఇంగ్లీషులోనే నానా తంటాలుపడి చెబుతున్నాడు. నోట్‌బుక్స్ అన్నీ కొనడానికి వాళ్ళ నాన్న దగ్గర డబ్బులు లేనందువల్ల ప్రస్తుతానికి ఫైన్ కట్టేయమన్నాడనీ, తర్వాత నోట్సులన్నీ కొంటానన్నాడనీ - వాడు చెప్పిన యింగ్లీషు వాక్యాల సారాంశం.

కల్పనకు బరువైన నవ్వొచ్చింది. ఇంగ్లీషు మీడియం స్కూల్లో తెలుగులో మాట్లాడితే టీచర్లకి ఫైన్ వెయ్యరు కానీ, విద్యార్థులకు మాత్రం ఫైన్ పడుతుంది.

కల్పన వాడి చేతిలోంచి రూపాయికాసు తీసుకొని, మళ్ళీ వాడి జేబులోనే వేసేసింది.

"ఇది పెట్టి నువ్వు జోబీ జెండా ఒకటి కొనుక్కొని, రేపు రానున్న రిపబ్లిక్ డేనాడు చొక్కాకి పెట్టుకో... నౌ గో అండ్ సిడౌన్' అని ఆదేశించింది.

పోలయ్యకి ఇదంతా ఆశ్చర్యంగా ఉంది. వాడు వెళ్ళి వాడి జాగాలో కూర్చున్నాడు. మిస్ కల్పనకి పోలయ్య రూపంలో ఏదో సందేశం, మరేదో హెచ్చరికా గోచరించాయి ఆ క్షణంలో.

తగిన వరుడు దొరికతే, తనని మిసెస్ కల్పనగా చేసి తొలేద్దామనే అనుకుంటున్నారు అమ్మా నాన్నా. వాళ్ల దగ్గర కట్నానికి చాలినంత పైకం లేదు. మంచి వరుడు దొరకని కారణంగా తాను

మిస్‌కల్పన కాస్తా కల్ప మిస్‌గా మారింది. అంటే ఇల్లాలు కాలేక పంతులమ్మ అయింది. అంతేగా.. కానీ,... కాని, నావంటి మిస్‌ల వల్ల రేపటి సంఘానికి ఏమిటి ఉపయోగం?' క్లాసులో ఉన్న ఆడపిల్లలవైపు చూసింది. జాలివేసింది. 'పోస్టుగ్రాడ్యుయేట్లు కూడా అవుతారు వీళ్ళు కానీ, పెళ్ళిళ్లు కావు' అని వెక్కిరించినట్లు అంటున్నారు ఎవరో మనసు లోపల.

మగపిల్లలవైపు చూసింది. కోపం వచ్చింది. 'వీళ్ళల్లో ప్రతి ఒక్కడూ కట్నాల మార్కెట్‌లో సిగ్గు లేకుండా నిలబడతాడు రేపు .... పోలయ్య మాత్రం వరుడు కాడా? రేపు.

"రేపటి మన సమాజం యొక్క జాతకాలు తరగతి గదుల్లోనే రాయబడతాయి. తరగతి గదుల్లో కూర్చున్న చిన్నారుల చేతి రేఖలు గాదు,. వారికి లభించే శిక్షణ దేశ సౌభాగ్యాన్ని ముందుగానే నిర్దేశిస్తుంది" అని అన్న మహానుభావుడెవరో - అతనికి చేతులెత్తి నమస్కరించాలనిపించింది కల్పనా బియ్యేకు.

టేబిల్ సొరుగు లాగింది. అప్రయత్నంగా జనవరి ఇరవై ఆరునాటి స్కూలు సబంరం కోసం తాను రాసిపెట్టుకున్న చిన్నసైజు లెక్చర్ కాగితం బయటికి తీసింది.

అందులో "మనమంతా దేశం కోసం - దేశ స్వాతంత్ర్య పరిరక్షణ కోసం పునరంకితం కావాలి" అని రాసి ఉన్న చివరి ఇంగ్లీషు వాక్యాన్ని ఎర్రపెన్నుతో కొట్టేసింది.

"ఈ పిల్లల్ని రేపటి సంస్కారవంతులైన పౌరులుగా తీర్చిదిద్దేటందుకు నన్ను నేను అంకితం చేసుకుంటున్నాను" అంటూ రాసి - చివరి మాటగా - "జై హింద్" అని రాస్తూ అప్రయత్నంగా బయటికే - "జై హింద్" అన్నది కల్పనా మిస్.

అకస్మాత్తుగా "జైహింద్" అన్న మాట మిస్ నోట విన్న విద్యార్థులు టక్కున లేచి నిలబడి, "జై హింద్"అన్నారు కోరస్‌గా.

తుళ్ళిపడింది. కల్పన... తేలికగా నవ్వేసింది. "యస్... యూ ఆర్ రైట్.. జైహింద్! యూ ఆల్ సిడౌన్ నౌ.. మీ "మిస్" మాత్రం "బెల్" అయ్యేటంతవరకూ - ఇలాగే "స్టాండప్" గానే ఉంటుంది" అన్నది నిర్దేశపూర్వకంగా.

"యస్... మిస్" అన్నారు పిల్లలంతా... వాళ్ళకి తమ మిస్ తనకి తాను ఎందుకు శిక్ష వేసుకుంటున్నదో అర్థం కాలేదు. కానీ, "యస్.. మిస్" అనిక్లాసంతా. అన్న మాట మాత్రం ఆమె ఎదుట ఒక కెరటంలాగ లేచి పడ్డది. కల్పనా మిస్‌కి" గిల్టీ ఫీలింగ్" పోయింది. 'యస్? అయామే కల్పనా మిస్... నాటే మిస్ కల్పన.' అనుకుంది. మనసు తేలికపడ్డది.

**(1993 -ఇండియాటుడే)**